క్లుప్తంగా

ఎస్సీ సెల్ ప్రతినిధులకు జోగి రమేష్ అభినందన



ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి కృష్ణా జిల్లా ఎస్సీ విభాగం ఇన్‌చార్జి ముదిగొండ ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులిమెట్ల శరత్ మాజీ మంత్రి జోగి రమేష్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జోగి రమేష్ వారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో ఎస్సీ సెల్ విభాగం కమిటీలు పూర్తి చేయాలని వారికి సూచించారు. అందుకు తగిన సహకారం అందిస్తానని జోగి రమేష్ తెలిపారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లమోతు దయాకర్, ఎన్.ప్రకాశ్, కాకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

240 మందికి నేత్ర వైద్య పరీక్షలు



ఇబ్రహీంపట్నం: మ్యాక్స్ విజన్ కంటి వైద్యశాల, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో గురువారం జాకీర్ హుస్సేన్ కళాశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 240 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో 15 మందికి కంటి శుక్లాలు, 11 మందికి రెటీనా సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఎన్టీఆర్ వైద్య సేవలో ఉచితంగా సర్జరీ చేస్తామన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ జాఫర్ సాదిక్, వస్తాన్‌వలి, కౌన్సిలర్ అమ్మాజీ, న్యాయవాది వల్లభనేని నాగ పవన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్



వెంకటప్పలనాయుడు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో బయాలజీ అధ్యాపకుడిగా పని చేస్తున్న కరణం వెంకటప్పలనాయుడు లైఫ్ సెన్సెస్ విభాగం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. గీతం యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య ఎస్. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ పరిశోధన పూర్తి చేశారు. రాష్ట్రంలోని కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో ఎంపిక చేసిన 'వ్యవసాయ భూముల్లో భార లోహాల విశ్లేషణ' అంశంపై చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ లభించింది. వెంకటప్పలనాయుడిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ అభినందించారు.

అయ్యంకికి ఘన నివాళి



తిరువూరు: గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి కార్యక్రమం గురువారం తిరువూరు, గంపలగూడెం మండలం పెనుగొలను గ్రంథాలయాల్లో నిర్వహించారు. పెనుగొలను శాఖా గ్రంథాలయంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. క్రిస్టఫర్ గ్రంథాలయాల ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు గ్రంథాలయాల్లో సభ్యత్వం పొంది ప్రతి రోజూ పుస్తక పఠనం చేయాలని ఆయన సూచించారు. గ్రంథాలయ నిర్వాహకురాలు శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తిరువూరు శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పద్మావతి, పాఠకులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

విస్సన్నపేట: విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక శ్రీశ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌వలన కలిగే అనార్థాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారికి మంచి పేరు తీసుకువచ్చేలా ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు చదవాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశం చేసుకోవద్దని సూచించారు. కళాశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కే సిబ్బందికి శిక్షణ

తిరువూరురూరల్: రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషించాలని ఎన్టీఆర్ జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉప సంచాలకులు టి. వెంకటేశ్వర్లు అన్నారు. తిరువూరు వెలుగు కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సామర్థ్యాల పెంపుపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వరి, పత్తి పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఆకర్షక, ఎర పంటలు, లింగాకర్షక బుట్టలు, పసుపు, నీలి రంగు అట్టల ఉపయోగాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, రైతులు ఎటువంటి సందేహాలు అడిగినా నివృత్తి చేయాలని వెంకటేశ్వర్లు సూచించారు. తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు రంగారావు, వ్యవసాయాధికారులు పద్మ, హరీష్, సాయిశ్రీ, టెక్నికల్ ఏఓ టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

దుర్వాసన.. దోమలకు నిలయాలు

- వర్షం కురిస్తే ఇళ్లల్లోకి చేరుతున్న మురుగునీరు
- దుర్వాసన వెదజల్లుతున్న డ్రెయినేజీలు
- డ్రెయిన్‌లో పడి ప్రాణాలు కోల్పోతున్న పిల్లలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఎన్టీటీపీఎస్ సెక్యూరిటీ కాలనీ నుంచి డ్రెయిన్ ద్వారా ఖాజీమాన్యంలో ప్రవహిస్తున్న మురుగునీరు



ఇబ్రహీంపట్నం పట్టణంతో పాటు ఎ.కాలనీ నుంచి ఖాజీమాన్యం డ్రెయినేజీ నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కాలనీల నుంచి వెలువడే వ్యర్థాలతో పాటు పట్టణంలో నుంచి వాడుక నీరు, వర్షం నీరు కృష్ణానదిలో కలిసే డ్రెయిన్లతో ఖాజీమాన్యం ప్రజలకు ముప్పు పొంచి ఉంది. డ్రెయిన్ నుంచి వెలువడే దుర్వాసనను ఆ ప్రాంతాల్లోని ప్రజలు భరించలేకపోతున్నారు. గతంలో ఈ డ్రెయినేజీలో పడి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. డ్రెయినేజీలు దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. వర్షాకాలంలో మురుగు నీరు ఇళ్లల్లోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కానీ పక్కా డ్రెయిన్‌లు కానీ నిర్మించి పైన మూతలు ఏర్పాటు చేయాలని కోరుతునప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

అధికారులు, పాలకుల నిర్లక్ష్యం

ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ, సెక్యూరిటీ కాలనీ, ఎస్ఆర్టీ కాలనీల నుంచి వెలువడుతున్న మురుగునీటి వ్యర్థాలను కృష్ణానదిలో కలిపేందుకు ఖాజీమాన్యం మధ్యలో ఏర్పాటు చేసిన డ్రెయిన్ సుమారు కిలోమీటరుకు పైగా పొడవు ఉంది. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారేందుకు ఎన్టీటీపీఎస్ అధికారులు, పాలకుల నిర్వహణ లోపమే కారణమని స్థానికులు చెబుతున్నారు. కాలువ ఎత్తు పెంచాలని, భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పాలకులు సైతం ఓట్లు అడిగేందుకు కాలువ దుర్వాసన భరించలేక ముక్కుమూసుకుని వస్తారని, గెలిచిన తర్వాత సమస్యను పట్టించుకోరని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాలువ పక్కన పెరిగిన మొక్కల నుంచి విష పురుగులు ఇళ్లల్లోకి చేరడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎన్టీటీపీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారంపై ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ పక్కదారి పట్టిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

మృత్యు నిలయంగా డ్రెయినేజీలు

మురుగునీటి వ్యర్థాలు పారుదల అయ్యే డ్రెయిన్‌లో పడి గతంలో ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. స్థానికంగా ఉంటున్న తిరుపతి జమలమ్మ ఇంటికి చుట్టపు చూపుగా వచ్చిన వారి నాలుగేళ్ల కుమారుడు ఆడుకుంటూ డ్రెయినేజీలో పడి చనిపోయాడు. కాలనీకి చెందిన మరో బాలుడు వెడల్పు ఉన్న డ్రెయినేజీ దాటుతూ జారిపడి మృతిచెందాడు. ఇంకో బాలుడు కూడా ఆటలాడుతూనే డ్రెయిన్‌లో పడి మృత్యుఒడిలోకి జారుకున్నాడు. అనేకమంది డ్రెయినేజీలు దాటుతూ జారిపడి కాళ్లు, చేతులు విరిగిన సందర్భాలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే మురుగు సమస్య



ఇళ్ల పక్కన డ్రెయినేజీల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక పోతున్నాం. ఎన్నో ఏళ్లుగా సమస్య ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. వారంలో ఒక రోజు డ్రెయినేజీ పూడిక తీసినా సమస్య ఇంత తీవ్రంగా ఉండదు. పాలకులు ఓట్లు అడిగేందుకు ముక్కు మూసుకుని వస్తారు. గెలిచాక విస్మరిస్తారు. పాలకుల నిర్లక్ష్యంతోనే మురుగు సమస్య నెలకొంది.

– వల్లెపు నాగలక్ష్మి, ఖాజీమాన్యం

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలి



ఖాజీమాన్యం నుంచి వెళుతున్న డ్రెయినేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ఇళ్లల్లోకి, వీధుల్లోకి నీరు చేరి జీవనం అస్తవ్యస్తం అవుతోంది. ఎన్నో ఏళ్లుగా అండ్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని అధికారులు, పాలకులను కోరుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలి.

– కుంచం గంగమ్మ, ఖాజీమాన్యం

మానసిక ఆరోగ్యంపై అవగాహన

కవులూరు (ఇబ్రహీంపట్నం): వాసవ్య మహిళా మండలి, లీవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కవులూరు గ్రామంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. మానసిక వ్యాధిగ్రస్తులకు ఆకలి లేకపోవడం, నిద్ర పట్టకపోవడం, పదేపదే ఆలోచనలతో సతమతమవడం, ఆందోళన, ఒత్తిడికి గురికావడం వంటి అంశాలపై ప్రముఖ సైక్రియాట్రిస్ట్ కామాక్షి అవగాహన కల్పించారు. 55 మందికి వైద్యం అందించారు. పరిసర గ్రామ ప్రజలకు నిమ్రా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ రామారావు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ

ఆగిరిపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ శుభశేఖర్ పేర్కొన్నారు. వడ్లమానులో వాహనదారులకు, గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. వాహనాలు నడిపేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అతివేగం, ఓవర్ లోడ్, అజాగ్రత్తతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని చెప్పారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

జి.కొండూరు: మండల పరిధి కట్టుబడిపాలెం గ్రామం నుంచి కవులూరు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ.2 కోట్లతో ఈ రహదారి నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



ఎరువుల స్టాకును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ చైతన్య

జి.కొండూరు: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే అటువంటి షాపులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ కావూరి చైతన్య అన్నారు. జి.కొండూరులోని గ్రోమోర్ సెంటర్‌ను సబ్ కలెక్టర్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులో స్టాకు, రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఈ పోస్‌ను తనిఖీ చేశారు. ఈ పోస్‌లో ఆధార్ నంబరుతో సేల్ నమోదును తప్పక చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి కేసీహెచ్ సూరిబాబు పాల్గొన్నారు.

బుడమేరు వరదను పరిశీలించిన తహసీల్దార్



కొండపల్లి వద్ద బుడమేరు నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పట్టిసీమ నీటితో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న అధిక వర్షాలకు బుడమేరుకు భారీగా వరద నీరు చేరుతోంది. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు కొండపల్లి శాంతినగర్ వద్ద వరద ఉధృతిని గురువారం పరిశీలించారు. పట్టిసీమ నీరు బుడమేరు ద్వారా కృష్ణానదిలో చేరుతున్న నేపథ్యంలో రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులు నిలిపివేశారు. వరద నీటి ప్రవాహం పెరిగితే బుడమేరు కట్టకు ఏమైనా ప్రమాదం పొంచి ఉందా అనే కోణంలో పరిశీలించారు. గతంలో విజయవాడను ముంచెత్తిన బుడమేరు జల ప్రళయాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి ప్రవాహాన్ని అంచనా వేశారు. బుడమేరు ప్రస్తుత పరిస్థితిని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. వీఆర్వో విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేద సాగుదార్లకు పట్టాలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్ వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జి.కొండూరు: భూ ఆక్రమణోద్యమాల ద్వారా భూమిని సాధించుకుని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. చెవుటూరు గ్రామంలో పేద సాగుదార్లతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జి.కొండూరు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ చెవుటూరు గ్రామంలో 62 ఎకరాలను నిరుపేదలు రెండు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న క్రమంలో ప్రభుత్వం వెంటనే సాగుదారులకు పట్టాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, మండల కార్యదర్శి గూడూరు శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

చాట్రాయి: మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుకు రావాలని నూజివీడు డీఎస్పీ ప్రసాద్ పేర్కొన్నారు. చనుబండ ఉషోదయ హైస్కూల్లో మాదవక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను వినియోగించడం వల్ల మానసికంగా మనిషి అనారోగ్యం పాలవుతారని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపవద్దని, సైబర్ నేరాలపై అప్రమతంగా ఉండాలని, బాల్య వివాహాలు చేయకూడదని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, ఉషోదయ హైస్కూల్ కరస్పాండెంట్ దొబ్బిగడ్ల వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి చేద్దాం

తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు



ప్లకార్డులతో గంజాయి వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

తిరువూరు: గంజాయి వంటి మాదక ద్రవ్యాలతో యువత నిర్వీర్యమైపోతున్నారని, వీటి బారిన పడకుండా సామాజిక చైతన్యం రావాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తిరువూరులో వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి గంజాయితో కలిగే అనర్థాలను వివరిస్తూ గురువారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. బైపాస్‌రోడ్డు వినాయకుడి గుడి సెంటర్ నుంచి రాజుపేట పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ప్రదర్శన సాగింది. విద్యార్థులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుకోవలసిన వయసులో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. వీటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ ప్లకార్డులతో ప్రదర్శన జరిపారు.

అధికారుల నిర్లక్ష్యంపై కౌన్సిలర్ల ఆగ్రహం

వాడీవేడిగా నూజివీడు మున్సిపల్ కౌన్సిల్



సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్లు

నూజివీడు: కౌన్సిలర్లు చెప్పిన సమస్యలను మున్సిపల్ అధికారులు పరిగణనలోకి తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్య, డ్రెయినేజీల్లో చెత్తచెదారం తొలగించే పనులు రోజూ జరగడం లేదన్నారు. 150 మంది సిబ్బంది ఉంటే ప్రతి రోజూ 30 మంది వరకు గైర్హాజరవుతున్నారని, మున్సిపల్ అధికారులు మాత్రం రాని వారికి హాజరు వేసి వర్కర్ల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇలా అయితే పారిశుద్ధ్యం ఎలా మెరుగుపడుతుందని నిలదీశారు. పెద్దగాంధీబొమ్మ సెంటర్ వద్ద నుంచి పీజీ సెంటర్ మీదుగా హనుమాన్‌జంక్షన్ రోడ్డు వరకు ఉన్న వన్‌వేలో గోతులను వెంటనే పూడ్చించాలని కోరారు.

అధికారులు తీరుపై ఆగ్రహం

కౌన్సిలర్ నడకుదురు గిరీష్ మాట్లాడుతూ కౌన్సిలర్లు తమ సమస్యలను చెబుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని, కనీసం నమోదు చేసుకొని వచ్చే సమావేశం నాటికి ఆ సమస్యను పరిష్కరించారా? లేదా? అనే సమాచారం కూడా ఇవ్వడం లేదన్నారు. పట్టణంలోని చేతి పంపులకు మరమ్మతులు చేయించి పునరుద్ధరించాలని చెప్పి మూడు నెలలు గడిచినా ఇంత వరకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. కబేళాలో పశువైద్యులు వచ్చి స్టాంపు వేసిన తరువాతే జీవాలను కట్ చేసి మటన్ దుకాణాల్లో అమ్మాల్సి ఉండగా నూజివీడులో అవేమీ జరగడం లేదని, మున్సిపల్ అధికారులు ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. ప్రతి రోజూ వందలాది జీవాలను కబేళాలో వధిస్తున్నారని, కానీ అవి ఎలాంటివో ఎవరూ చూడటం లేదన్నారు.

రెగ్యులర్‌గా చెత్త తరలించాలి

16వ వార్డు కౌన్సిలర్ శీలం రాము మాట్లాడుతూ కనీసం రెండు వార్డులకు ఒక ట్రాక్టరు చొప్పున 32 వార్డులకు 16 ట్రాక్టర్లు ఏర్పాటు చేసి చెత్తను రెగ్యులర్‌గా డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. 25వ వార్డు కౌన్సిలర్ కొమ్ము విజయ మాట్లాడుతూ కుక్కలను పట్టి ఆరేషన్ చేసేందుకు ఏలూరు తరలిస్తున్నారని, ఒక్కొక్క కుక్కకు రూ.1400 చెల్లిస్తున్నారని, అయితే ఆ కుక్కలకు నిజంగా ఆపరేషన్ చేయిస్తున్నారా? మధ్యలో వదిలేస్తున్నారా? వంటివేవీ పర్యవేక్షించడం లేదని, దీని వెనుక అవినీతి జరుగుతుందని మండిపడ్డారు. వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, డీఈ వెంకట్రావు, కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ తదితరులు పాల్గొన్నారు.

పూజ సామగ్రి సమర్పణ



తిరువూరు: స్థానిక చీరాల సెంటర్‌లోని కోదండ రామాలయంలో నిత్య పూజలకు అవసరమైన సామగ్రిని గుండా రంగారావు, జ్యోతిలక్ష్మి గురువారం వితరణగా ఇచ్చారు. తొమ్మిది కలశాలు, ఎనిమిది పంచపాత్రలు, ఒక తీర్థపు బిందె, రెండు ఉద్ధరిణలను ఆలయ నిర్వాహకులు సోమవరపు సత్యనారాయణకు, అర్చకులు గోపాల కృష్ణమాచార్యులుకు వారు అందజేశారు.

పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తిరువూరు: బాలికల రక్షణకు ప్రభుత్వం పటిష్ట చట్టాలు అమలు చేస్తోందని, ఇబ్బందికర పరిస్థితి ఎదురైనప్పుడు పోలీసు సేవలను వినియోగించుకోవాలని గంపలగూడెం ఎస్ఐ శ్రీను సూచించారు. గంపలగూడెం మండలం పెద కొమెర కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత సంరక్షణతో పాటు అసభ్యంగా ప్రవర్తించే వారిని గుర్తించి సంరక్షించుకోవడంలో బాలికలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ నేరాల బారిన పడి నష్టపోవద్దని, బాలికలకు మాయమాటలు చెప్పి ట్రాఫికింగ్ చేసే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

జీతాలు అందించాలని ఉపాధ్యాయుల వినతి



ముసునూరులో ఎంఈఓ-1ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ యూనియన్ల నేతలు

ముసునూరు: ఉపాధ్యాయుల జీతాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ–1ను ఉపాధ్యాయ నేతలు కోరారు. ఇటీవల ఎంఈఓ–1గా బాధ్యతలు చేపట్టిన రామ్మూర్తిని గురువారం ఎస్టీయూ, డీపీఆర్‌టీయూ ఉపాధ్యాయ నేతలు కలసి తమ కోర్కెలు తెలిపారు. సీనియర్ నేత సాయిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలంలో నియామకాలు పొంది, విధుల్లో చేరిన వారి వివరాలను త్వరగా పొందుపర్చి, వారి జీతాలను త్వరగా అందించాలన్నారు. అనంతరం ఎంఈఓ–1ను ఉపాధ్యాయ నేతలు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బీవీఎస్ సుబ్బారావు, ఎస్టీయూ గౌరవాధ్యక్షుడు భాస్కర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు జీవీ రత్నం, బాబూరావు, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఉదయభాస్కర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే



వేమిరెడ్డిపల్లి(విస్సన్నపేట): మండలంలోని వేమిరెడ్డిపల్లి తండాలో జ్వరాలు విజృంభించడంతో గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం గురువారం కొనసాగిందని మండల వైద్యాధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. వైద్య బృందాలతో జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. వైద్య శిబిరం వద్దే రక్తపరీక్షలు, వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. గ్రామంలో తాగునీటి శాంపిల్స్ తీసి పరీక్షకు పంపారని చెప్పారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జాషువా రచనలు

తిరువూరు: ప్రముఖ రచయిత, మహాకవి గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిబాబా యూత్ కమిటీ కన్వీనర్ యజ్ఞకృష్ణ మాట్లాడుతూ కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢ నమ్మకాలపై తిరగబడిన జాషువా తన రచనలతో సామాజిక చైతన్యం రగిలించారని వివరించారు. ఉపాధ్యాయులు యలగందుల శ్రీనివాసరావు, సాయిబాబా కమిటీ సభ్యులు బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

విస్సన్నపేట: కేశినేని ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా కార్యక్రమం ఈ నెల 26న నిర్వహిస్తామని శ్రీశ్రీ పీజీ కళాశాల డైరెక్టర్ సీహెచ్ రాజేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. శ్రీ శ్రీనివాసా డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మెగా జాబ్ మేళాలో 20కిపైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.